క్లుప్తంగా

ఆదిలక్ష్మి అమ్మవారికి విశేషార్చన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: పేరుపాలెం కనకదుర్గమ్మ బీచ్‌లో వేంచేసియున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఆదిలక్ష్మీ అమ్మవారికి విశేషార్చన, 108 తామర పుష్పాలతో హోమం నిర్వహించారు. ప్రముఖ పండితులు అనిల్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

29న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నెల 29వతేదీ బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శనివారం విలేకరులకు తెలిపారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

పాలకొల్లు సెంట్రల్: దళితుల కాలనీలోకి చొరబడి ఉన్మాదంతో రాళ్లతో దాడులు చేసి ఒక దళిత యువకుడి మృతికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వరప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్లు కావస్తున్నా ఇంకా దళితులపై దాడులు జరగడం దురదృష్టమని అన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో అగ్రవర్ణ కులస్తుల దాష్టీకానికి బలైన దళిత యువకుడు నడిపల్లి రాముని పథకం ప్రకారమే హత్య చేశారన్నారు. ఈ సంఘటనకు కారకులైన 11 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు రౌడీషీట్‌లు కూడా ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు నేరం



పెనుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ వర్కర్లు, విద్యార్థులు

పెనుగొండ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటికి బాలికలు అంగీకరించకూడదని, ఎవరైనా ఒత్తిడి తీసుకువచ్చి బాల్య వివాహాలు చేస్తే శిక్షలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి హెచ్చరించారు. శనివారం చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు వివాహం చేయాలన్నా ఆలోచనను పెద్దలు విరమించుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతుంటే సత్వర సమాచారం అందించాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకట రమణమూర్తి, టి.వరలక్ష్మీ, పలివెల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరునిగా అలంకరణ



ప్రత్యేకాలంకరణలో వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమారాచార్యులు స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా వైభవ వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

పాలకొల్లు సెంట్రల్: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీపై కక్షపూరిత చర్యలు చేపడుతుందని సీపీ సభ్యులు షేక్ మహబూబ్ జానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో పీసీసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రొక్కాల బెన్నీపాల్, గోడి మోహనరావు, కడలి భాస్కరరావు, యలమర్తి మోనహర్రావు, భాను ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరాతో అండ

- మూడో విడత వైఎస్సార్ ఆసరా అమలు
- డ్వాక్రా మహిళలకు ఆర్థిక వెనులబాటు

పాలకొల్లు అర్బన్: డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా అమలుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకిచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల దృష్టిలో నిలిచిపోయారనే అభిప్రాయం ప్రతీ ఒక్కరిలో వ్యక్తమవుతోంది. ప్రజల సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను రూపొందించి వాటిని లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం పారదర్శక పాలనకు నిదర్శనమని పేర్కొంటున్నారు. సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తూ గత పాలకులకు కనువిప్పుగా కలిగేలా వ్యవహరిస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు హామీలివ్వడమే తప్ప వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయరనే నానుడికి చరమగీతం పాడేలా సీఎం జగన్ హామీ ఇచ్చారంటే తప్పనిసరిగా అమలు చేస్తారని నమ్మకం ప్రతీ ఒక్కరిలో కలిగించారు.

ఎంత రుణం ఉంటే అంతా మాఫీ

ఏప్రిల్ 11వ తేదీ 2019 నాటికి డ్వాక్రా మహిళలకు వారి బ్యాంక్ రుణం ఎంత ఉన్నా నాలుగు విడతలుగా మాఫీ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చిన మేరకు ఇప్పటి వరకు రెండు విడతలు అమలు చేశారు. మూడో విడత రుణ మాఫీ శనివారం దెందులూరులో సీఎం జగన్ డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా బటన్ నొక్కి అమలు చేయడంతో డ్వాక్రా మహిళలు హర్షామోదాలు వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలకు రూ.10 వేలు పసుపు కుంకుమ అని చెప్పి వాటిని కూడా సక్రమంగా అమలు చేయలేదని డ్వాక్రా మహిళలు చంద్రబాబునాయుడి పాలనపై పెదవి విరిచారు. ప్రస్తుతం మాత్రం ఇచ్చిన మాటే వేదంగా అమలు చేస్తున్న నాయకుడిని చూస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాలకొల్లు మండలం వడ్లవానిపాలెంలో డ్వాక్రా గ్రూపు మహిళల సమావేశం దృశ్యం (ఫైల్)

మండలం	గ్రామసంఘాలు	స్వయం సహాయక సంఘాలు	లబ్ధి పొందిన మహిళలు
పాలకొల్లు	54	1300	13,144
పాలకొల్లు పట్టణం	---	921	9210
యలమంచిలి	55	1363	13630
పోడూరు	34	1176	11893

రూ.9,81,952 రుణమాఫీ



మాది వడ్లవానిపాలెం, శ్రీ సాయి స్వయం సహాయక సంఘాన్ని స్థాపించుకుని బ్యాంక్ నుంచి రుణం పొందాం. మా గ్రూపు సభ్యులంతా పాల వ్యాపారం చేస్తాం. మాకు రూ.9,81,952 రుణ మాఫీ అయ్యింది. ఒక్కొక్కరికీ నాలుగు విడతల్లోనూ రూ.98,195 రుణమాఫీ అయ్యింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ మాకు ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ కాలేదు.

– బొల్ల తులసీకుమారి, వడ్లవానిపాలెం

నాకు రూ.73,200 రుణమాఫీ



వైఎస్సార్ ఆసరా పథకంలో రూ.73,200 రుణ మాఫీ అయ్యింది. బ్యాంక్ ఖాతాలోకి నేరుగా డబ్బులు వేయడం ఎంతో ప్రయోజనం. మా గ్రూపు సభ్యులు లేసు అల్లికల ద్వారా ఉపాధి పొందుతున్నాం. దారాలు కొనుగోలుకు ఆసరా డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సీఎం జగన్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

– మైలవరపు ప్రశాంతి, లయన్స్ నగర్

13,144 మందికి లబ్ధి



పాలకొల్లు మండలంలో 13144 మంది మహిళలకు లబ్ధి చేకూరింది. మూడు విడతల్లో రుణమాఫీ రూ.26,22,00,000 జరిగింది. మూడో విడత సొమ్ములు రూ.13,67,76,661 ఈ వారంలో ప్రతీ డ్వాక్రా మహిళ ఖాతాల్లో జమ కానున్నాయి.

– కలిగితి జ్యోతి రాణి, ఏపీఎం డీఆర్‌డీఏ

ప్రభుత్వాసుపత్రికి వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి దాతలు యినకొండ శేషాద్రి కుటుంబ సభ్యులు వాటర్ కూలర్‌ను బహూకరించారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో కొర్లపాటి హనుమంతరావు జ్ఞాపకార్థం పట్టణ రోటరీ క్లబ్ ట్రెజరర్ యినుకొండ శేషాద్రి, ఝాన్సీ దంపతులు రూ. 25 వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను అందజేశారు. శేషాద్రి మాట్లాడుతూ హనుమంతరావు వద్ద తాను ఎలక్ట్రిషన్ వర్క్ నేర్చుకున్నానని గురుభక్తిని చాటుకోవాలనే ఉద్దేశంతో ఆయన జ్ఞాపకార్థం ఆసుపత్రికి వాటర్ కూలర్‌ను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభాకరరావు, ఆసుపత్రి కమిటీ మెంబర్ చెన్ను విజయ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ నళిని, డాక్టర్ రేణుక, రోటరీ క్లబ్ అధ్యక్షులు చవ్వాకుల నరేష్, కుంపట్ల రాజా, ఐ సాయిమణికంఠ పాల్గొన్నారు.

వేగంగా సమస్యల పరిష్కారం



తూర్పుపాలెంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రజలు తెలిపిన సమస్యలకు సత్వర పరిష్కారానికి ప్రతిపాదనలు చేసి పనులు చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఆచంట, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి ప్రతీ సచివాలయానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. దీనికి అనుగుణంగా అభివృద్ధి పనులు ప్రతిపాదనలు చేసి, చేపట్టాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ వీటిని సత్వరం పూర్తి చేయాలన్నారు.

డ్వాక్రా మహిళలతో సమావేశాలు

వైఎస్సార్ ఆసరాలో భాగంగా డ్వాక్రా మహిళల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. వీటిని ప్రతీ డ్వాక్రా మహిళలకు వివరించడానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని వెలుగు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచి, వారికి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రతీ మహిళా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, జడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణి, పార్టీ నాయకులు పిల్లి నాగన్న, రుద్రరాజు శివాజీరాజు, గుబ్బల వీర బ్రహ్మం,నాడు దుర్గారావు, ఆకిశెట్టి చంటి, దంపనబోయిన బాబూరావు, చిన్నం ఏడుకొండలు, మేడిచర్ల పండు, కర్రి వేణుబాబు, సత్తి వెంకటరెడ్డి, విష్ణుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



మార్టేరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, మహిళాభ్యున్నతికి దేశంలో పాటుపడుతున్న ఏకైక నాయకుడు అని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. శనివారం మార్టేరులోని రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ ఆసరాలో లబ్ధి పొందిన మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని సీఎం జగన్ నిలబెట్టుకొన్నారన్నారు. గతంలో చంద్రబాబు మాట ఇచ్చి తప్పారన్నారు. సీఎం జగన్ మాత్రం మాట కోసం మడమ తిప్పకుండా ఎన్ని కష్టాలు ఎదురైనా నిలబెట్టుకుంటున్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ హామీలను అమలు చేశారన్నారు. మహిళలు అందరూ సీఎం జగన్‌కు అండగా నిలుస్తారన్నారు. పెమంట్ర మండలంలో 11600 మంది సభ్యులకు రూ.10.86 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా కుమారి, ఎంపీటీసీ జి లక్ష్మణ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, డ్వాక్రా సీఏలు, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో దళిత క్రైస్తవులకు న్యాయం



పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యన్నాబత్తుల నాగేశ్వరరావు అన్నారు. శనివారం పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పున్నయ్య, రంగనాథ్ కమిషన్లు దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని సిఫార్సు చేసినా అప్పటి కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బౌద్ధ, సిక్కు మతాలు స్వీకరించిన దళితులకు రిజర్వేషన్లు కల్పిస్తూ క్రైస్తవ మతం తీసుకున్న దళితులకు రిజర్వేషన్లు వర్తించకుండా చేయడం వివక్షత చూపడమేనన్నారు. ప్రస్తుత కేంద్రప్రభుత్వం దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చి వారికి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విలువలు కోల్పోయిన తెలుగుదేశం పార్టీ నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ పార్సి వెంకటరత్నం, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, సర్పంచ్‌లు రాపాక నగేష్ కరుణాకర్, పొలిమేర వెంకట్వేశర రావు, కెల్లా సింహాచలం, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా పాల్గొన్నారు.

అసెంబ్లీలో తీర్మానంపై హర్షం

పాలకొల్లు అర్బన్: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాలకు న్యాయం చేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ప్రజా సంకల్పయాత్రలో పాలకొల్లు విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలకొల్లు మండలం సగంచెరువులో వినతిపత్రం అందజేసినట్లు గుర్తు చేశారు.

చారిత్రక నిర్ణయం

నరసాపురం: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని తీర్మానం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీ వింగ్ కన్వీనర్ బుడితి సుమన్, నరసాపురం షెడ్యూల్‌కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిర్రే బాబూరావు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి దళిత క్రైస్తవుల నిరకాల కోరికను నెరవేరుస్తున్నారని చెప్పారు.

షీర్ వాల్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణం



కలగంపూడిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ వారణాసి సుబ్రహ్మణ్య సిద్ధాంతి

యలమంచిలి: జగనన్న కాలనీల్లో షీర్ వాల్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు గృహనిర్మాణ ఈఈ వారణాసి సుబ్రహ్మణ్య సిద్ధాంతి చెప్పారు. కలగంపూడి గ్రామంలోని జగనన్న కాలనీలో ఈ విధానంలో ప్రారంభించిన కాలనీ ఇళ్లను లబ్ధిదారులతో కలసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో స్థల పూడిక జరిగి రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించినా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వమే ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకుని షీర్ వాల్ టెక్నాలజీతో ఇల్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ పద్ధతిలో గోడలన్నీ కాంక్రీట్‌తో నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతోతోపాటు, డ్వాక్రా రుణం రూ.35 వేలతో ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. లబ్ధిదారుడు డ్వాక్రా రుణం మాత్రమే తీర్చవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏనుగువానిలంక, బాడవ ఎంపీటీసీ సభ్యులు వినుకొండ ధనలక్ష్మి, ఇంటి సూర్యారావు వైఎస్సార్ సీపీ నాయకులు వినుకొండ రవి ఏనుగువానిలంక సర్పంచ్ ఈద ప్రమీల, రాయి సత్యనారాయణ ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, హౌసింగ్ ఏఈ కంకిపాటి రాజారామ్ వర్క్‌స్పెక్టర్ మత్తే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

పెనుగొండ: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు సత్వరం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని గృహనిర్మాణ సంస్థ మండల ప్రత్యేకాధికారి పి.నాగార్జునరావు అన్నారు. శనివారం పెనుగొండ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందన్నారు. లబ్ధిదారులు అందరూ వేగంగా నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈ ఎం.గోపాలరాజు, మండల ఏఈ బి.లక్ష్మణరావులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ పిప్పళ్ళ వారితోటలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ ఏటా ఉగాది వెళ్లిన తర్వాత వచ్చే ఆదివారం అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఆసాదుల నృత్యాలు, తీన్ మార్ డప్పులతో, బాణసంచాకాల్పులతో అమ్మవారి జాతరను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీది అనైతిక గెలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరు పెద్దిరాజు

పాలకొల్లు అర్బన్: ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని అనైతికంగా గెలిచిందని జడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరు పెద్దిరాజు ఘాటుగా విమర్శించారు. దీనికోసం తెలుగుదేశం పార్టీ వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన హేళన చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు వారి సంఖ్యాబలం ప్రకారం ఎమ్మెల్సీని గెలవడంతో పాటు నలుగురు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు కోట్లాది రూపాయలు ఇచ్చి ప్రలోభాలకు గురి చేసి గెలిచారని దుయ్యబట్టారు. పోడూరు మండల కన్వీనర్ కలిదిండి గణపతిరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, పెనుమదం సొసైటీ అధ్యక్షుడు కొత్రపాటి వీరాస్వామి, పార్టీ నాయకులు పితాని సత్యనారాయణ (చిన్న), బళ్ల రాజశేఖర్, వడ్లపాటి ఆనందరాజు, చుట్టుగుళ్ల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

దుష్టరాజకీయాలకు గుణపాఠం తప్పదు

పోడూరు: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన దుష్టరాజకీయాలకు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న అన్నారు. గుమ్మలూరు గ్రామంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టడం వల్లే దుష్టరాజకీయంతో టీడీపీ ఒక్క ఎమ్మెల్సీ గెల్చుకుందన్నారు. గతంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలతో లొంగదీసుకున్న టీడీపీని ఆ తరువాత జరిగిన 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చిత్తుగా ఓడించినా వెన్నుపోటు రాజకీయానికి కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబు తన బుద్ధి మార్చుకోలేదన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



కాజ తూర్పులో గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న దృశ్యం

యలమంచిలి: పాడి రైతులందరూ తమ పశువులకు వేసవి ప్రారంభంలోనే గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయించాలని పాలకొల్లు డివిజన్ పశుసంవర్థక సహాయ సంచాలకులు డాక్టర్ మేడా రామశేఖర్ కోరారు. కాజ తూర్పు గ్రామంలో శనివారం ఆయన టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పు వలన వేసవిలో పశువులు గాలికుంటు వ్యాధికి గురవుతాయన్నారు. ఈ వ్యాధి సోకితే పశువులు నీరసించి పాల దిగుబడి తగ్గుతుందన్నారు. ప్రభుత్వం పశుసంవర్థక శాఖ ద్వారా ఏప్రిల్ 24 వరకూ ఉచితంగా ఈ టీకాలు వేయిస్తుందన్నారు. కనుక పాడి రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ దొమ్మేటి మాధురి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను పశువులకు టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. టీకా వేసే రోజున ఆయా గ్రామాల వెటర్నరీ అసిస్టెంట్‌లు, వలంటీర్స్ ద్వారా పాడి రైతులకు సమాచారం అందిస్తామన్నారు. ఆ సమయంలో రైతులు తమ పశువుల వద్ద ఉంటే సిబ్బంది వచ్చి టీకాలు వేస్తారన్నారు. కాజ తూర్పు గ్రామంలో శనివారం 150 పశువులకు టీకా వేసినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

నరసాపురం: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్లో పరిసరాల పరిశుభ్రత, రూమ్స్‌లో వసతులు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన వసతులు ఎలా ఉన్నాయి? అనే అంశాలను ఆరా తీశారు. మరుగుదొడ్లు, వంటశాల పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి గౌరీశంకరరావు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. హాస్టల్‌లో వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, ఇతర సమస్యలు ఉన్నా మండల న్యాయ సేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఘనంగా బాపనయ్య వర్ధంతి

పెనుగొండ: అట్టడుగు దళిత కులంలో పుట్టి అంటరాని తనం కారణంగా అనేక అవమానాలు భరించి, జరిగిన అవమానాన్ని కమ్యూనిస్టు నాయకుల సహకారంతో ఎదుర్కొని నిలబడిన మహనీయుడు బాపనయ్య అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయన అన్నారు. శనివారం పెనుగొండ గాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగిన కర్షక- కార్మిక ప్రచార యాత్రలో భాగంగా గుంటూరు బాపనయ్య చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ కార్యదర్శి ఆకుల హరేరామ్, ఆంధ్రపరదేశ్ కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, రైతు సంఘ నాయకులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు, షేక్ పాదుషా, ఎస్ వెంకటేశ్వరరావు, ఆవుల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా కర్షక, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీకి తరలిరావాలని సిఐటియూ ప్రచార యాత్రలో నాయకులుపెనుగొండలో పిలుపు నిచ్చారు.

నేడు రైల్వే గేటు మూత

పాలకోడేరు: రైల్వే ట్రాక్ మరమ్మత్తుల నిమి త్తం శృంగవృక్షం రైల్వే గేటును 26వ తేదీ ఉద యం 7 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 8 గంటల వరకు రెండు రోజుల పాటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారని ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి కె వెంకటరాజు తెలిపారు. ప్రయాణీకులు తమకు సహకరించాలని కోరారు.

భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు

ఉండి: భర్త కనిపించడం లేదంటూ భాభార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి చెందిన కలిదిండి శివరామరాజు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో భీమవరం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి 17వ తేదీన తాను విజయవాడలో ఉన్నానని ఇంటికి వచ్చేరదుకు రైలు ఎక్కుతున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. తన భర్త ఇంత వరకు ఇంటికి రాలేదంటూ అతని భార్య అన్నపూర్ణ చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్థలం ఆక్రమణపై కేసు

భీమవరం అర్బన్: స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం పంచాయతీ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. యనమదుర్రుకి చింతపల్లి మోహన్‌రావు, ఆయన కుమారుడు చింతపల్లి దేవాదత్తం పంచాయతీ డ్రెయిన్‌ను ఆక్రమించి పాకవేయడంతో కార్య దర్శి, వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్: దయ్యాలతిప్పలో శనివారం డ్రిస్టిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఈబీ ఎ.కోటేశ్వరరావు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ. 16,500, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

భీమవరం సబ్ జైలు తనిఖీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్ష పడిన ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలు అప్పీల్ ఫైల్ చేసుకోడానికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చునన్నారు. ఆయన వెంట ఉచిత న్యాయ సలహాదారుడు బి.సునీల్ కుమార్, జైలు పర్యవేక్షణాధికారి వెంకటగిరి ఉన్నారు.